
# ఇన్‌స్టా ముసుగులో వలపువల

- ఎన్నారైని బ్లాక్‌మెయిల్ చేసి నిశ్చితార్థం
- భారీగా డబ్బు వసూలుకు ప్లాన్
- బాధితుడి ఫిర్యాదుతో యువతి అరెస్టు
- విశాఖపట్నంలో వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయాలతో యువకులను ముగ్గులోకి దింపి వారి నుంచి డబ్బులు గుంజుతూ మోసాలకు పాల్పడుతున్న యువతిని ఏపీ పోలీసులు అరెస్టుచేశారు. భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని మురళీనగర్‌కు చెందిన కొరుప్రోలు జోయ్ జమీనా అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ మనోహర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నది. వైజాగ్‌లో నివాసముంటున్న ఆ యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మనోహర్ స్నేహితురాలిని అంటూ పరిచయం చేసుకున్నది. కొన్ని రోజుల పాటు వారితో మంచిగా నటిస్తూ మీ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పగా వారు నిరాకరించారు. దీంతో ఆమె అమెరికా నుంచి యువకుడిని రప్పించి ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా మురళీనగర్ ఎన్జీవో కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లింది. మత్తు పానీయం ఇచ్చి ఇరువురు సన్నిహితంగా ఉంటున్నట్టు ఫొటోలు తీసింది. వాటితో తనను పెళ్లి చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేసింది. భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో రూ.5 లక్షలు ఖర్చు చేయించి తన స్నేహితుల సమక్షంలో బలవంతంగా నిశ్చితార్థం చేయించుకున్నది. అనంతరం పెళ్లి చేసుకోకపోతే అభ్యంతరకర ఫొటోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ వేధింపులకు గురిచేసింది. ఎన్నారై మనోహర్‌ను రోజుల తరబడి ఇంట్లో బంధించింది. ఎట్టకేలకు ఆమె నుంచి తప్పించుకున్న బాధితుడు.. ఈ నెల 4న భీమిలి పోలీస్‌స్టేషన్‌లో యువతిపై ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితురాలి నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారించి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


నోటీసు చూపిస్తున్న చంద్రనాయక్



కోర్టు నుంచి వచ్చిన నోటీసు

## తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు నోటీసులు

- సకలజనుల సమ్మెలో ఆర్టీసీ బస్సు ఆపినందుకు..
- అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు
- నవంబర్ 19న హాజరుకావాలని 28 మందికి సమన్లు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: ప్రత్యేక రాష్ట్రం కోసం 2011లో సకల జనుల సమ్మె సమయంలో అప్పటి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్టీసీ బస్సులను ఆపారు. అందుకు గానూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ ఉద్యోగ సంఘం నాయకులపై అక్రమ కేసులను బనాయించింది. తాజాగా మళ్లీ పాత కేసులను బయటకు తీసి వారికి నోటీసులు పంపడం బాధాకరం. 28 మంది తెలంగాణ ఉద్యమకారులకు నోటీసులు పంపి.. నవంబర్ 19న కోర్టుకు హాజరు కావాలని పేర్కొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యమాన్ని తమ భుజస్కంధాలపై మోస్తూ సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఉద్యోగ సంఘం నాయకులకు తాజాగా నోటీసులు రావడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నోటీసులందుకున్న 28 మందిలో 15 మంది ఇప్పుడు ఉద్యోగ విరమణ పొందారు. వారి వయస్సు 70 ఏండ్ల పైబడింది. నలుగురు మహిళా ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా ఆ కేసును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యమ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## కనుల పండువగా గంగానీళ్ల జాతర

సారంగాపూర్/దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : నిర్మల్ జిల్లా సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో గంగానీళ్ల జాతర అంగరంగా వైభవంగా ముగిసింది. ఆదివారం భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలో నిలబడి మొక్కులు తీర్చుకున్నారు. గంగానీళ్ల జాతరను పురస్కరించుకొని నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

### కూష్మాండ మాతగా ఏడుపాయల దుర్గమ్మ



మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గమ్మ కూశ్మాండ మాత అలంకరణతో దర్శనమిచ్చారు. – పాపన్నపేట

### మహాలక్ష్మి అలంకరణలో..




మహబూబ్‌నగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.6,66,66,666తో అలంకరించారు. – పాలమూరు

### లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ



విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసిపోయింది. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

### ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు



శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## ఈబీసీలపై కాంగ్రెస్ వైఖరేంటి?: రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఈబీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరేమిటో స్పష్టం చేయాలని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఈబీసీల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వీ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈబీసీల జోలికొస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.

## గోమాతకు పుట్టిన రోజు వేడుకలు



జగిత్యాలజిల్లా బీర్‌పూర్‌లో ఓ రైతు కుటుంబం లేగ దూడకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించింది. బైరవేని సత్యనారాయణ– భాగ్యలక్ష్మి దంపతులు పెంచుకుంటున్న ఆవుకు పుట్టిన లేగదూడకు ఆదివారంతో సంవత్సరం నిండింది. ఈ క్రమంలో వేద పండితుడి ఆధ్వర్యంలో గోమాతకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేట్ కట్ చేసి.. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. – సారంగాపూర్



## డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో డొక్కు బస్సుల స్థానంలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చేందుకు సంస్థ ప్లాన్ చేస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గత పదేండ్లలో ఏకంగా 6,680 డొక్కు బస్సులను ఆర్టీసీ తుక్కు కింద వేలం వేసి అమ్మేయగా, వాటిస్థానంలో 4,226 బస్సులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వెంటనే తుక్కుగా మార్చాల్సిన 1,213 డొక్కు బస్సుల స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ఇటీవలే ఆర్టీసీ నివేదిక పంపింది. పీఎం ఈ డ్రైవ్ పథకంలో హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని సంస్థ ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్నది. నగరం అవసరాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మరో 2,300 ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకునే చాన్స్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఒక్కో బస్సు ధర రూ.1.85 కోట్లు ఉండడంతో అద్దెకు తీసుకోవాలని యోచిస్తున్నది.

## సింగూరు రెండు గేట్లు ఎత్తివేత

పుల్కల్, అక్టోబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం 6, 11వ నంబర్ గేట్లు 1.50 మీటర్ల మేర ఎత్తి 11,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్తు ఉత్పత్తి కోసం జెన్కోకు 2,796 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం 13,076 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, 14,453 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగినట్టు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.708 టీఎంసీలు నీరు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

## భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

బోథ్, అక్టోబర్ 6 : కౌఠ(బీ) గ్రామంలో 56 రకాల వంటకాలతో దుర్గమాతకు భక్తులు నైవేద్యం సమర్పించారు. అలాగే అమ్మవారికి కూరగాయలతో అలంకరించారు. వివిధ రకాల దుంపలు, కూరగాయలతో మాలలు వేసి అలంకరణ చేపట్టారు. మహిళలు శోభాయాత్రగా వెళ్లి దుర్గమ్మకు, బ్రహ్మంగారి ఆలయంలో ఒడి బియ్యం పోశారు.

భీంపూర్, అక్టోబర్ 6 : భీంపూర్, శాంతినగర్, కరంజి(టీ), గోముత్రి, అంతర్గాం, లక్ష్మీపూర్, సెంటర్‌సాంగ్వి, తాంసి(కే) గ్రామాల్లో దేవీ నవరాత్రులు కనులపండవగా కొనసాగుతున్నాయి. శాంతినగర్‌లో కొలాం ఆదివాసీలు కఠిన నియమాలతో ఉపవాసదీక్షలు చేస్తున్నారు. పిప్పల్‌కోటి, కరంజిలో ముస్లింలు భజనకీర్తనలు చేస్తున్నారు. తహసీల్దార్ నలందప్రియ , డీటీ హరిదాస్, ఆర్ఐ రాందాస్, ఎస్ఐ కలీంలు నవరాత్రి ఉత్సవాల పర్యవేక్షణ చేస్తున్నారు.


కౌఠ(బీ)లో కూరగాయలతో అమ్మవారు

## నిర్మల్ చెత్తమయం


నిర్మల్‌లోని ప్రధాన వీధిలో నిండిన చెత్త

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 6 : ఆరు రోజుల నుంచి తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ నిర్మల్ పట్టణం మున్సిపల్ కార్మికులు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. మున్సిపల్ కార్మికులు విధులను బహిష్కరించడంతో పట్టణంలోని ప్రధాన ప్రాంతాలైన బస్టాండ్. పాత బస్టాండ్, నారాయణ రెడ్డి మార్కెట్, మున్సిపల్ కాంప్లెక్స్‌తో పాటు ప్రధాన షాపింగ్ మాల్స్, 42 వార్డుల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో నడవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విజయదశమి పండుగ సందర్భంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో వివిధ పూజ అవసరాలకు బయటకు రావాలంటే రోడ్లపై చెత్త దుర్గంధం ఉండడంతో దీక్షాదారులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలానే ఉంటే వ్యాధులు ప్రబలుతాయని వెంటనే మున్సిపల్ కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## మండల వాసికి స్వామి వివేకానంద జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న సామాజిక కార్యకర్త రాజ్‌కుమార్

బోథ్, అక్టోబర్ 6 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో నిర్వహించిన అవార్డు కార్యక్రమంలో ఆదివారం మండలానికి చెందిన సామాజిక కార్యకర్త రాజ్‌కుమార్ బాశెట్టికి స్వామి వివేకానంద జాతీయ అవార్డు వరించింది. బహుజన సాహిత్య అకాడమీ ఎనిమిదో రచయితల సమ్మేళనంలో అవార్డును బీఎస్పీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా తీసుకున్నారు. గుండెపోటు వచ్చినప్పుడు చేయాల్సిన (సీపీఆర్), సైబర్ నేరాలు, పర్యావరణ పరిరక్షణ, నవ సమాజాన్ని నిర్మించే ఉపాధ్యాయుని పాత్ర, స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశం, చరిత్రకు సజీవ సాక్షాలు నాణెలు, ఆడ పిల్లలకు చదువు అవశ్యకతపై చేస్తున్న సామాజిక సేవను దృష్టిలో పెట్టుకొని అవార్డును ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అర్జుమన్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 6 :జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సయ్యద్ అర్జుమన్ అలీని నియమిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రం వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎర్రవోతు రాజేందర్ విధులు నిర్వహించారు. చైర్మన్‌గా ఎన్నికైన అర్జుమన్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందిచారు.

# అడెల్లి పొచ్చమ్మ గంగనీళ్లకు తరలిన భక్తులు

బోథ్, అక్టోబర్ 6 : మండలంలోని పార్డి(కే) గ్రామస్తులు ఆదివారం గంగనీళ్ల జాతరకు తరలివెళ్లారు. గ్రామంలోని పోచమ్మ ఆలయంలో అమ్మవారికి అలంకరించిన ఆభరణాలు తీసుకెళ్లి ప్రతి ఏటా గంగనీళ్లతో శుభ్రం చేసి స్నానాలు ఆచారించి తిరిగి వస్తారు. ఈ క్రమంలో గ్రామస్తులంతా డప్పులు వాయిద్యాల నడుమ గ్రామంలో శోభాయాత్ర చేపట్టిన అనంతరం గంగనీళ్ల జాతరకు వెళ్లారు. కార్యక్రమంలో గ్రామపటేల్ అమృత్‌రావ్, దేవరి జైతు, తుకారాం, పెందూర్ జైతు, రమేశ్, భరత్, మహిళలు పాల్గొన్నారు. బోథ్ మండలంలోని కౌఠ(బీ), అందూర్, ధన్నూర్(బీ), బోథ్, కన్గుట్ట, పొచ్చెర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు, వాహనాలు, కాలినడకన అడెల్లి పోచమ్మ గంగనీళ్ల జాతరకు తరలివెళ్లారు. నిర్మల్ జిల్లా సాగెం గ్రామం వద్ద ఆభరణాల ఊరేగింపులో పాల్గొనడానికి బయలుదేరారు.


గంగనీళ్ల జాతరకు వెళ్తున్న పార్డి(కే) గ్రామస్తులు



## ఘనంగా బోనాల పండుగ

▲ బోనాలతో మహిళలు

నర్సాపూర్ (జీ), అక్టోబర్ 6 : నర్సాపూర్(జీ)లోని కుర్మెవాడకు చెందిన దుర్గాదేవి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు, వివిధ మండపాల వద్ద కొలువుదీరిన దుర్గాదేవి ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. దీక్షాదారులు, మహిళలు, చిన్నారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మలతో స్వర్ణకార సంఘం మహిళలు

## బతుకమ్మ వేడుకలు

భైంసా, అక్టోబర్ 6 : భైంసాలోని స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను ఆడి శోభాయాత్రగా గడ్డెన్నవాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. స్వర్ణకార సంఘం అధ్యక్షుడు జెజ్జంకి రవి, ఉపాధ్యక్షుడు సాగర్, ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్, కోశాధికారి రాజు పాల్గొన్నారు.


5 లక్షల 11 వేల రూపాయలతో కన్యకా పరమేశ్వరి మాత

## అమ్మవారికి రూ.5 లక్షల 11వేల నగదుతో అలంకరణ

భైంసా, అక్టోబర్ 6 : భైంసాలోని సంతోషిమాత మందిరం ముందు గల వాసవి కన్యకా పరమేశ్వరి మాతకు ఆదివారం రూ.5 లక్షల 11 వేల నోట్లతో అలంకరించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ అలంకరణ చేపట్టారు.

## లైటింగ్ ఫ్లాషెష్‌పై శిక్షణ తరగతులు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 6 : నిర్మల్‌లో జిల్లా ఫొ టో, వీడియోగ్రఫీ సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో గాడాక్స్ కంపెనీ వారి ఫోటో వీడియో కెమెరా లైటింగ్ ఫ్లాషెష్‌పై నిఖిత డిస్ట్రిబ్యూటర్, శివజ్యోతి ఎలక్ట్రానిక్స్ వారు ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. శరత్ సాగర్, సతీశ్ రాహుల్ టెక్నికల్ టిప్స్ బేసిక్స్ మెనూ సెట్టింగ్స్, గింబాల్‌వాడే విధానంపై వివరించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అయిట్ల ప్రవీణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంశీ, మంత్రి సుమన్, మాచర్ల శ్రీకాంత్, కృష్ణవర్మ, కిరణ్, దొంతుల గంగాధర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఐచర్ వ్యాన్‌ను ఢీ కొని యువకుడి మృతి

జైనథ్, అక్టోబర్ 6 : జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలో ఆగి ఉన్న ఐచర్ వ్యాన్‌ను ఆదివారం ఉదయం స్కూటి ఢీ కొని హర్షవర్ధన్(17) మృతి చెందాడు. ఎస్ఐ పురుషోత్తం, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన హర్షవర్ధన్, ఆయన స్నేహితుడు పుంద్రు నీరజ్ రెడ్డి కలిసి పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర కేలాపూర్ జగదాంబ మాత ఆలయానికి పాదయాత్రగా శనివారం వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరు స్నేహితులు స్కూటిపై కేలాపూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వస్తుండగా పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న ఐచర్ వ్యాన్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తలకు తీవ్ర గాయాలైన నీరజ్ రెడ్డి (20) చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలించారు. నీరజ్ రెడ్డి జైనథ్ గ్రామానికి చెందిన వాడు కాగా హర్షవర్ధన్ శాంతినగర్ వాసి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రిమ్స్ మార్చురి గదికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

## చెరువులో పడి ఒకరి మృతి


దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : కడుపు నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన అడెపు రాజు (37) అదే గ్రామంలోని చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి స్థానికంగా ఉన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి ఏడు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. వైద్యం చేయించుకున్న తక్కువ కాకపోవడంతో పాటు ఆర్థిక పరిస్థితులు బాగులేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నర్సాపూర్ (జీ), అక్టోబర్ 6 : నర్సాపూర్(జీ) మండలం రాంపూర్ ఎర్రకుంట చెరువులో ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి చెరువులో పడి మృతి చెందాడు. అటువైపు వెళ్లిన కొందరు నీటిపై తెలియాడుతున్న మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీయించి వివరాలు తెలుసుకున్నారు. మృతుని ఒంటిపై నల్లని ప్యాంటు , తెల్లనిషర్ట్ ధరించి ఉన్నాడు.

## సామాజిక సేవలో యువత

ఎదులాపురం, అక్టోబర్ 6 : ఆదిలాబాద్‌లోని ఈద్గా మైదానం వద్ద గల ఖబ్రస్తాన్‌ను పలువురు యువకులు పక్షం రోజుల నుంచి శుభ్రం చేస్తూ సామాజిక స్ఫృహను చాటారు. సమాధుల మధ్యలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగింంచారు. అకాల మృతి చెందిన వారి అంత్యక్రియల కోసం తీసుకొచ్చినప్పుడు వచ్చే వారు, నివాళులర్పించడానికి వచ్చే వారికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు యువకులు తెలిపారు. శ్రమదానం చేసిన వారిలో హాఫిజ్ ఆరిఫ్ ఖాన్, హాఫిజ్ ఫిరోజ్, మౌలానా ఫారూఖ్, అజ్జు హుస్సేన్, హాఫిజ్ జాఫర్, అబ్దుల్ రహీం, కైఫ్ ఉన్నారు.


శ్రమదానం చేస్తున్న యువకులు